క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



శివకోటయ్యకు పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: మండలంలోని అన్నగారిపాలెంకు చెందిన టీడీపీ నేత పులి శివకోటయ్య శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పులి శివకోటయ్య మాట్లాడుతూ అన్నగారిపాలెంలో ఉనికి లేని టీడీపీకి పట్టు తీసుకువచ్చానన్నారు. కావ్య కృష్ణారెడ్డి తనను అనేక రకాలుగా అవమానపరిచాడని తెలిపారు. కావలిలో టీడీపీ ఓడిపోవడానికి సరైన నాయకుడిని పెట్టని చంద్రబాబే కారణమని అని నేరుగా ఆయనికే చెప్పానన్నారు. కావలికి నాన్‌లోకల్ కావ్య కృష్ణారెడ్డిని టీడీపీ ఇన్‌చార్జిగా నియమించడంతో తాను ఆ పార్టీని వీడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, కావలి ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, కావలి మండలం జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు, నాయకులు జనిగర్ల మహేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ

కొండాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంచాయతీని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ బొడ్డు అనూరాధ కోరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుజాత ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందించే ప్రతి పథకాన్ని ప్రజలకు చేర్చాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో పంచాయతీల్లో సిమెంట్ రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ కోటేశ్వరరావు, ఎంఈఓ ఆనందరావు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు శ్రీనివాసరావు, జిలానీ, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

20 మద్యం బాటిళ్ల స్వాధీనం

సంగం: మండలంలోని చెన్నవరప్పాడులో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. తమకు అందించిన సమాచారంతో శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని గుర్తించి అతని వద్ద 20 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

హైవే ఎక్కితే భయం

- ప్రమాదకరంగా మారిన ప్రయాణం
- హైవే పక్కన అడ్డగోలుగా దాబాలు, రోడ్డు పక్కనే పార్కింగ్‌లు
- పోలీస్, హైవే శాఖల సిబ్బందికి మొబైల్ వాహనాలు కేటాయింపు
- రహదారిపై గస్తీ తిరగకుండా ఎక్కడో చోట ఆపి నిద్రపోతున్న వైనం
- కావలి సమీపంలో ఇటీవల అనేక ఘోర ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికులు, వాహనచోదకులు
- తాజాగా కావలి సమీపంలో ఘోర ఘటనకు కారణాలివే



దగదర్తి మండలం ఉలవపాళ్ల కూడలిలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలు



ముసునూరు సమీపంలో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ట్రావెల్స్ బస్సు

కావలి: చెన్నై– కోల్‌కతా జాతీయ రహదారి ఆరు లేన్లుగా విస్తరించడంతో ఏషియన్ హైవేగా మారింది. విశాలమైన రోడ్లు ఉండడంతో వాహనచోదకులు సైతం మితిమీరిన వేగంతో రహదారులపై దూసుకుపోతున్నారు. రాత్రి వేళ అయితే వేగంగా వెళ్తున్న వాహనాల పరిస్థితిని గమనిస్తే ప్రమాదాలు జరగడం ఖాయం అనేట్లుగా ఉంటుంది. హైవేపై ప్రయాణం అభద్రతగా మారింది. వాహనచోదకులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాల తీవ్రత భారీగా ఉంటుంది. రోడ్ల మార్జిన్‌లో వాహనాలను నిలిపివేస్తుండడంతో వెనుక నుంచి వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. దీనికి కారణాలు కూడా లేకపోలేదు. జాతీయ రహదారి పక్కనే 24 గంటలూ నడిపిస్తున్న దాబా హోటళ్లు, టీ కేఫ్‌లతో రోడ్డు మార్జిన్‌ల్లోనే వాహనాలను నిలిపేస్తున్న కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

గస్తీ చేపట్టని పోలీస్, హైవే శాఖల సిబ్బంది

జాతీయ రహదారుల పక్కనే వాహనాలు నిలపకుండా ఎక్కడా ఎటువంటి ఆటంకాలు ఎదురుకాకుండా పగలు, రాత్రి షిఫ్ట్ డ్యూటీల్లో పోలీస్, హైవే శాఖలు సిబ్బందిని నియమించి వారికి కేటాయించిన పరిధిలో వాహనాల్లో గస్తీ తిరుగుతూ రోడ్ల పక్కన ఎక్కడా వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. గస్తీ డ్యూటీలు సక్రమంగా చేయకుండా ఎక్కడో చోట హైవే పక్కన టీ కేఫ్‌లు, దాబాల్లో కూర్చొని కాలక్షేపం చేయడం, తమ వాహనాలను రోడ్డు పక్కన సేఫ్ ప్రదేశంలో పార్కింగ్ చేసి నిద్రపోతున్నారు. తాజాగా శనివారం తెల్లవారుజామున కావలి సమీపంలో ముసునూరు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ఘోర ప్రమాదంలో ఏడుగురు మృత్యువాత పడగా, మరో పాతిక మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి కచ్చితంగా హైవే గస్తీ సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోంది.

రోడ్డు భద్రత నిబంధనల అమలు ప్రకటనలకే పరిమితం

ప్రస్తుతం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఇంతటి ఘోర ప్రమాదం జరగడం గమనార్హం. రాత్రి పూట రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిద్ర మత్తులో వాహనాలు నడపకుండా పోలీసులు రాత్రి వేళల్లో తరచూ తనిఖీలు నిర్వహించి 'ఫేస్‌వాష్' పేరుతో డ్రైవర్లకు 'టీ' ఇప్పించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఇటువంటి కార్యక్రమాలు ఎక్కడా అమలు కావడం లేదు. జాతీయ రహదారిపై వాహనచోదకులు రెస్ట్ తీసుకునేందుకు రెస్ట్ ఏరియాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగించడం లేదు. వీటిని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి కొందరు హోటళ్లు, పెట్రోల్ బంకులు నిర్వహిస్తుంటే.. కొందరు ధాన్యం నిల్వ కేంద్రాలుగా వాడుకుంటున్నారు.

డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణం..

కావలి సమీపంలో ముసునూరు వద్ద జరిగి ఘోర ప్రమాదానికి ఇసుక రీల్స్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం. తాను డ్రైవింగ్ చేయాల్సి ఉండగా నిద్రపోతూ పట్టుమని 22 ఏళ్లు కూడా లేని క్లీనర్‌కు వాహనాన్ని అప్పగించడమే పెను విషాదానికి కారణమైంది. హెవీ లోడ్‌తో వాహనాన్ని అనుభవం, సామర్థ్యం లేని క్లీనర్‌కు వాహనాన్ని అప్పగించడంతో అదుపు చేయలేక పోవడంతోనే భారీ ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్లపై పోలీసుల తనిఖీలు లేకపోవడంతో డ్రైవర్ల స్థానంలో క్లీనర్‌లు వాహనాలు నడపడం, ఒక్కోసారి మద్యం మత్తులో వాహనాలు నడిపిస్తుండటంతో తరచూగా ఎక్కడోచోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

దాబాలు, టీ కేఫ్‌లు ప్రమాదాలకు దారి

సింగరాయకొండ నుంచి గూడూరు వరకు హైవేపై దాబాలు 24 గంటలూ నిరంతరాయంగా నడుస్తున్నాయి. రాత్రులు దాబాల్లో భోజనాలు చేసేందుకు, టీలు తాగేందుకు డ్రైవర్లు లారీలను రోడ్డు మార్జిన్‌లో నిలిపేసి ప్రమాదాలకు కారణమవుతున్నారు. కూడళ్ల వద్ద లారీలను రోడ్లకు ఇరువైపులా నిలిపేస్తుండటంతో రోడ్డు దాటే వాళ్లు, వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. దగదర్తి మండలం ఉలవపాళ్ల, దామవరం కూడలిలో రోడ్లకు ఇరువైపులా దాబా హోటళ్లు, అల్పాహార అంగళ్లు ఉండడంతో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం రోడ్లకు ఇరు వైపులా లారీలు నిలిపేస్తున్నారు. దీంతో రోడ్డు దాటే వాళ్లకు వేగంగా వస్తున్న వాహనాలు కనిపించగా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కావలి–నెల్లూరు మధ్య హైవేపై జోరుగా వెళుతున్న గ్రావెల్ టిప్పర్ల కారణంగా వాహనచోదకులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. నిండుగా గ్రావెల్, ఇసుక నింపుకుని వేగంగా వెళుతున్న టిప్పర్ల నుంచి రేగుతున్న దుమ్ము, గ్రావెల్ వెనుక వస్తున్న వాహనచోదకుల కళ్లల్లో పడుతూ ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపై జారుతున్న గ్రావెల్ కారణంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమష్టిగా పని చేయాల్సిన అవసరం ఉంది.



చీకట్లోనే సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు



ఇనుప రీల్స్ లారీ ఢీకొనడంతో రోడ్డు పక్కన బోల్తాపడిన గేదెల లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న ట్రావెల్స్ బస్సు, లారీని రోడ్డు మార్జిన్‌లోకి చేర్చిన దృశ్యం



కావలి ఏరియా వైద్యశాలలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి

సొంత నిధులతో రహదారికి మరమ్మతులు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి, ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్ రెడ్డి
- సంగం–కలిగిరి రహదారి మరమ్మతులకు భూమిపూజ



సంగం–కలిగిరి రహదారి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

అనుమసముద్రంపేట: 'మేకపాటి కుటుంబం గడిచిన దశాబ్దాలుగా తమ సొంత నిధులతోనే ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో శాశ్వత అభివృద్ధి పనులు చేశాం. విద్యారంగానికి సంబంధించి వందలాది ఎకరాలు ఉచితంగా అందజేశాం. చేసింది చెప్పుకుంటామే తప్పా అబద్ధాలు చెప్పాల్సిన దౌర్భాగ్యం మాకు లేదు' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఏఎస్‌పేట మండలం అక్బరాబాద్ వద్ద సంగం–కలిగిరి రోడ్డు పునరుద్ధరణ పనులకు శనివారం మేకపాటి సోదరులు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి ఈ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు రోడ్లన్నీ బురదమయమంటూ పచ్చపత్రికల్లో అబద్ధాలతో బురద జల్లుతున్నారన్నారు. టీడీపీ హయాంలో కి.మీ. రోడ్డు కూడా నిర్మాణాలు జరగలేదన్నారు. ఆ ప్రభుత్వంలో రోడ్లు నిర్మించి ఉంటే ఇప్పుడు రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. టీడీపీ రోడ్లు వేసి ఉంటే అప్పుడే ధ్వంసం అయ్యాయంటే అంత నాశిరకంగా రోడ్లు నిర్మించారా అని ప్రశ్నించారు. సంగం– కలిగిరి రహదారికి తమ సొంత నిధులు వెచ్చించి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. జగనన్న పాలన దేశానికే ఆదర్శమన్నారు. పేదరికాన్ని తగ్గించడంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారన్నారు. రూ.లక్షల కోట్లతో మౌలిక వసతుల ఏర్పాటుకు జగనన్న చర్యలు చేపట్టారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు, అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ ఏర్పాటుతో మెట్ట ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య పూర్తిగా తీరుతుందన్నారు. రానున్న ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని, ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు ప్రతి కార్యకర్త వివరించాలన్నారు. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లను కోరారు. సంక్షేమ పథకాలన్ని ప్రజలకు అందడంతో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని, దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో ఎంతో అభిమానం పెరిగిందని తెలిపారు. కరోనా సమయంలో దాదాపు రాష్ట్రం రూ.70 వేల కోట్ల నష్టపోయినప్పటికీ సంక్షేమ పథకాలు ఆపకుండా ప్రతి ఒక్కరికి అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. రానున్న రోజుల్లో మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు కొడవలూరు ధనుంజయరెడ్డి, యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, ఎంపీపీలు బోయళ్ల పద్మజారెడ్డి, కేతా వేణుగోపాల్ రెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, కాటం రవీంద్రారెడ్డి, నాయకులు రవీంద్ర, అలీ అహ్మద్, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వీఏఓల నూతన కమిటీ ఏర్పాటు

సోమశిల: అనంతసాగరం మండలం వెలుగు వీఏఓల యూనియన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. చిలకలమర్రి సెక్టార్‌కు పీ కల్పన, పీ భూమిక, అనంతసాగరానికి ఎం.సౌభాగ్యమ్మ, వై.సుజాత, సోమశిలకు బీ లక్ష్మి, వై శ్రీకళ, రేవూరుకు సీహెచ్ లక్ష్మి, పీ ఆదిలక్ష్మి, కమిటీ గౌరవ అధ్యక్షుడిగా షేక్ అన్వర్‌బాషా, కన్వీనర్‌గా సీహెచ్ లక్ష్మితో పాటు కో కన్వీనర్లను ఎన్నుకున్నారు. వెలుగు వీఏఓల జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ శివప్రసాద్, సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా పాల్గొన్నారు.

చేనేతలకు భూమి పట్టాలివ్వండి

కావలి: ముప్పై ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయకపోవడం, చేనేత కార్మికులను చిన్నచూపు చూడటమేనని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు పూజల లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కలిగిరి మండలం కొత్తపేట రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు1లో 48 ఎకరాల సీలింగ్ భూమిని మొత్తం 44 కుటుంబాలకు 1993లో ఒక్కొక్క కుటుంబానికి 1.10 ఎకరాల వంతున ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆ భూములకు ఇప్పటి వరకు పట్టాలు ఇవ్వకుండా చేనేతలను అధికారులు ఇబ్బందులు పెట్టడం బాధాకరమన్నారు. చేనేతలు సాగు చేసుకుంటున్నా భూములకు అధికారులు వన్‌బీ అడంగళ్ పాస్ పుస్తకాలు ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చేనేతలు సాగు చేసుకుంటున్న భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని కోరారు.

వైభవంగా గంధమహోత్సవం



గంధమహోత్సవంలో ఫకీర్ల విన్యాసాలు

సోమశిల: అనంతసాగరంలోని శ్రీహజరత్ సయ్యద్‌షా యూసఫ్ ఆలీషా ఖాదరి 42వ గంధమహోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి సొందల్ మాలితో ప్రారంభమైన గంధమహోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఫకీర్ల విన్యాసాలు డప్పు వాయిద్యాల నడుమ గంధ కలశాన్ని సజ్జదా ఇంటి వద్ద నుంచి ఆలీషా ఖాదరి దర్గాకు తీసుకు వచ్చారు. గంధాన్ని సమాధులకు లేపనం చేసి భక్తులకు పంచిపెట్టారు. శనివారం రాత్రి ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాధితులకు సీఎం జగనన్న అండ


- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- ఇద్దరికి రూ.15 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ అందజేత



అరుణకుమారికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

మర్రిపాడు: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రజలందరికీ వైద్యం అందజేస్తూనే ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు వైద్యం చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఇస్తూ వారికి అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. అనంతసాగరం మండలం అగ్రహారానికి చెందిన సన్నుబోయిన అరుణకుమారి భర్త వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో వైద్యం చేయించారని, అందుకు రూ. లక్షల ఖర్చు అయినప్పటికి కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయనిధి ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయించారు. శనివారం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో ఆ చెక్కును అరుణకుమారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఏఎస్‌పేట మండలం దూబగుంటకు చెందిన సూరం మాలకొండారెడ్డి అనారోగ్యంతో ఆపరేషన్ కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.10లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు పులిమి రమేష్‌రెడ్డి, అక్కలరెడ్డి అంకిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అక్కలరెడ్డి కొండారెడ్డి ఉన్నారు.

వైభవంగా దేవదేవేరుల కల్యాణాలు



అలఘునాథ స్వామి కల్యాణం

ఆత్మకూరు: పట్టణంలోని పురాతన ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథ స్వామి, జేఆర్ పేటలోని పద్మావతి, లక్ష్మీ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో దేవదేవేరులా కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించారు. ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి అర్చకులు కల్యాణ ఘట్టాలను వివరిస్తూ నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు.

కోరిన కోర్కెలు తీర్చే గండారపమ్మ తల్లి



చేజర్ల: కోరిన కోర్కెలు తీర్చే దేవతగా గండారపమ్మను చేజర్ల, చుట్టు పక్కల ప్రాంత ప్రజలు కొలుస్తారు. సుమారు 60 ఏళ్ల క్రితం గ్రామ దేవతగా గండారపమ్మ పూజలందుకొంటోంది. శుక్రవారం అంకురార్పణతో ఈ తిరునాళ్ల మొదలైంది. శనివారం ఉదయం అమ్మవారికి విశేష పూజలు, అనంతరం కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అశ్వర్థ నారాయణ కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం గండారపమ్మ తల్లికి గ్రామ పొంగళ్లు నివేదించనున్నారు.



వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



కావలి: వాసవి అన్ని కళల్లోనూ ఆరితేరింది. సంగీతం, తర్కశాస్త్రాల్లో మక్కువ చూపేది. విష్ణువర్ధనుడు తన రాజ్య విస్తరణలో భాగంగా జన సమూహంలో ఉన్న వాసవీని చూసి మోహించాడు. ఆమె లేకుండా తాను బతకలేనని భావించి ఆమెను వివాహమాడ నిశ్చయించాడు. అయితే ఈ విషయంలో నిర్ణయాన్ని వాసవికే వదిలేయమని సలహా ఇచ్చారు. వాసవి తాను జీవితాంతం కన్యగా ఉంటానని, ప్రాపంచిక విషయాలతో తనకి సంబంధం వద్దని తన నిర్ణయాన్ని కచ్చితంగా చెప్పేసింది. ఆత్మ బలిదానం వాసవి సూచనలను అనుసరించి, గోదావరి నది ఒడ్డున బ్రహ్మ కుండం అనే పవిత్ర స్థలంలో రాజభటులు 103 అగ్ని గుండాలను ఏర్పాటు చేశారు. అప్పుడు వాసవి 102 గోత్రాలకు సంబంధించిన జంటలను ఉద్దేశించి మీరంతా నాతో పాటు మంటల్లో దూకడానికి సిద్ధంగా ఉన్నారా అని అడిగితే వారంతా మనస్ఫూర్తిగా తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు. వారు వాసవిని దేవతా అంశగా భావించి, తమకి నిజరూపాన్ని చూపమని కోరారు. ఆమె నవ్వి తన నిజ స్వరూపాన్ని దేదీప్యమానమైన వెలుగుతో చూపించి నేను ఆది పరాశక్తి ఆర్య మహాదేవి అవతరాన్ని అని చెప్పింది. ధర్మాన్ని నిల్పేందుకు, స్త్రీ గౌరవాన్ని కాపాడేందుకు, వైశ్యుల ఔదార్యాన్ని ప్రపంచానికి చాటేందుకు కలియుగంలో జన్మించానని చెప్పింది. ఆమె అక్కడ చేరిన వారికి దేశభక్తి, నిజాయితీ, సమాజ సేవ, సహనం మొదలగు వాటిని ఉపదేశించింది. వాసవి ఆత్మత్యాగం ఒక నూతన శకానికి నాందిగా నిలిచింది. అప్పటి నుంచి వైశ్యులందరూ వాసవి కన్యకా పరమేశ్వరిని వైశ్య కుల దేవతగా తలచి పూజిస్తున్నారు.